సాక్షి
జగిత్యాల
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



అంజన్న సన్నిధిలో పూజలు

కొండగట్టు : రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి కుటుంబ సమేతంగా కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కలెక్టర్ యాస్మిన్‌బాషా స్వాగతం పలికారు.



నమో.. నారసింహ..

ధర్మపురి : అధిక ఆషాఢమాసం చివరి సోమ వారం సందర్భంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అదనపు ఎస్పీగా ప్రభాకర్‌రావు

జగిత్యాలక్రైం: రాష్ట్రంలో తొమ్మిది మంది అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో భాగంగా జగిత్యాల అడిషనల్ ఎస్పీగా ఆర్.ప్రభాకర్‌రావును నియమిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి.

బాధ్యతలు స్వీకరణ



లావణ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాజేశ్వర్

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా రాజేశ్వర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన కమిషనర్ ఆయాజ్ పదోన్నతిపై రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల బల్దియా కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. కాగా, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్యను రాజేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆవిష్కరణలకు ఆహ్వానం

జగిత్యాల: ఇంటింటా ఇన్నోవేషన్ ఆవిష్కరణలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. అర్హులైన ఆసక్తి గలవారు ఆవిష్కరణలకు సంబంధించి ఆరు వాక్యాలు, 2 నిమిషాల వీడియో జోడించి, నాలుగు ఫొటోలు జతచేసి, ఆవిష్కకర్త పేరు, ఫోన్ నంబరు, వయస్సు, గ్రామం, జిల్లా వివరాలతో 91006 78543 నంబరు వాట్సాప్‌కు ఈ నెల 5వ తేదీవరకు పంపించాలని సూచించారు. మొదటి షార్ట్‌లిస్ట్ తర్వాత 5 ఆవిష్కరణలు ప్రదర్శనకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

డీఎస్పీ రాజశేఖర్‌రాజు బదిలీ

జగిత్యాలక్రైం: జగిత్యాల ఎస్బీ డీఎస్పీ రాజశేఖర్‌రాజును నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా బదిలీ చేశారు. ఈమేరకు డీజీపీ అంజన్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. కాగా, రాజశేఖర్‌రాజు రెండు నెలల క్రితమే డీఎస్పీగా పదోన్నతి పొందారు.

పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మిషన్ శక్తి సభ్యులు

మల్యాల(చొప్పదండి): మహిళలు, పిల్లలు, వృద్ధులు, వికలాంగుల సహాయం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన పెంపొందించాలని మిషన్ శక్తి జిల్లా కో ఆర్డినేటర్ కె.అశ్విని సూచించారు. ముత్యంపేటలో సోమవారం అంగన్‌వాడీ టీచర్ల సెక్టార్ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ, 181 సఖి, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్లపై అవగాహన కల్పించారు. 60ఏళ్లు దాటినవారిని వేధిస్తే 14567 నంబర్‌కు ఫోన్‌చేయాలని సూచించారు. వికలాంగులు సహకారం కోసం 145326 నంబర్‌కు ఫోన్‌చేయాలని పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పవిత్ర, నరేశ్, హేమశ్రీ, గౌతమి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇమడలేక‘పోతున్నారు’!

కమిషనర్లపై రాజకీయ ఒత్తిళ్లు

- సవాల్‌గా మారుతున్న సమస్యలు
- వచ్చినవారు వచ్చినట్లే వెళ్తున్న వైనం
- దీర్ఘకాలిక సెలవులో మరికొందరు..



జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతల నిర్వహణ అధికారులకు ‘కత్తిమీద సాము’గా మారింది. జిల్లా కేంద్రం కావడం, ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు రావడం, నిత్యం ఏదోసమస్య వెంటాడుతుండడంతో కొందరు వచ్చీరాగానే బదిలీ చేయించుకుంటున్నారు. మరికొందరు దీర్ఘకాలిక సెలవులపై వెళ్తున్నారు. ఆ తర్వాత అట్నుంచి అటే బదిలీ చేయించుకుంటున్నారు. ప్రధానంగా విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించే కమిషనర్లు ఇక్కడ ఇమడలేకపోతున్నారు.

గ్రేడ్ వన్ మున్సిపాలిటీ..

- జగిత్యాల గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా గతంలోనే హోదా దక్కించుకుంది.
- బల్దియాలో మున్సిపల్ కమిషనర్ పోస్టు అత్యంత కీలకమైనది.
- ఇలాంటి బల్దియాకు వరంగల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అనిల్‌బాబు తాజాగా కమిషనర్‌గా నియమితులయ్యారు.
- ఆయన రాజకీయ ఒత్తిళ్లు తట్టుకుని పనిచేస్తారా, సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరిస్తూ ముందుకు సాగుతారా? అనే అంశాలపై ప్రస్తుతం జోరుగా చర్చ సాగుతోంది.
- గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన స్వరూపరాణి తమమాట వినడం లేదంటూ పలువురు ప్రజాప్రతినిధులు జిల్లా మంత్రి, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.
- దీంతో ఆమె బదిలీపై వెళ్లిపోయారు. ఆమె స్థానంలో గంగాధర్ నియమితులయ్యారు.
- ఆర్నెల్లు గడవక ముందే ఇలాంటి సమస్యలతోనే గంగాధర్ కూడా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు.

అక్రమాల వెల్లువ

- మున్సిపాలిటీలో అనేక అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు కౌన్సిలర్లు కలెక్టర్‌కు తరచూ ఫిర్యాదు చేయడం పరిపాటిగా మారింది.
- ఇందులో భాగంగానే గత కమిషనర్ స్వరూపారాణి వివిధ పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని బిల్లుల ఫైల్‌ను క్లియర్ చేయకుండా పక్కన పెట్టారు.

ఏ పనికైనా కమిషనరే కీలకం..

- పట్టణ ప్రగతి ద్వారా ప్రభుత్వం ప్రతినెలా దాదాపు రూ.90లక్షలు మంజూరు చేస్తోంది.
- వీటిని వెచ్చించి బల్దియాలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలి. మౌలిక వసతులు కల్పించాలి.
- ఇందులో ఏపని ముందుకు సాగాలన్నా.. కమిషనరే కీలకంగా ఉంటారు.
- ఇంతటి కీలక పోస్టును ఇన్‌చార్జి అధికారితో నెట్టుకు రావడంపై బల్దియా వాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.
- ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దాలని, జగిత్యాల బల్దియాకు పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలని పురపౌరులు కోరుతున్నారు.

జంకుతున్న అధికారులు

బల్దియాకు పూర్తిస్థాయి కమిషనర్లు పనిచేసిన దాఖలాలు దాదాపు లేవనే చెప్పాలి. ఇక్కడి పరిస్థితుల గురించి తెలుసుకున్న అధికారులు.. జగిత్యాల రావడానికి జంకుతున్నారు. గంగాధర్ బదిలీపై వెళ్లిపోయాక వెటర్నరీ శాఖలోని బోనగిరి నరేశ్‌కు మున్సిపల్ కమిషనర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే ఆయనకు నాలుగు ఇతర శాఖల బాధ్యతలు ఉన్నాయి. దీంతో ఆయనపై ఇప్పటికే పనిభారం అధికమైంది. అయితే, పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలని కొందరు కమిషనర్లు ఇప్పటికే ఉన్నతాధికారులకు విన్నవించారు.

- అయితే, ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆ బిల్లులకు సంబంధించిన ఫైల్‌ను ఎజెండాలో పొందుపరిచారు.
- ఇలాంటి అనేక పనులు ఎజెండాలో పొందుపర్చి బిల్లులు పొందుతున్నారని పలువురు కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.
- గతంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ దాడులు నిర్వహించింది. ఆ సందర్భంగా లంచం తీసుకుంటూ కొందరు అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా వారికి దొరికిపోయారు.
- దీంతో అప్పటి మున్సిపల్ కమిషనర్‌పై బదిలీ వేటువేశారు.

వసతులు అంతంతే..

జగిత్యాల బల్దియాలో 48 వార్డులు ఉన్నాయి. సుమారు లక్షకుపైగా జనాభా ఉంది. ఇంతపెద్ద పట్టణంలో మౌలిక వసతుల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. తేలికపాటి వర్షాలకే మురుగుకాలువలు పొంగిపొర్లుతున్నాయి. అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. జనావాసాల్లో నీటినిల్వలు కుంటలను తలపిస్తున్నాయి. దోమలు, ఈగలు వృద్ధి చెంది పట్టణవాసులు వ్యాధులకు గురవుతున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ దివాకర

ఉద్యోగం ఇప్పించండి.. వంతెనలు నిర్మించండి

- ప్రజావాణికి బాధితుల మొర

జగిత్యాలటౌన్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ దివాకర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అభాగ్యులు తరలివచ్చారు. వివిధ సమస్యలపై అధికారులకు 15అర్జీలు సమర్పించారు. వారిలో కొందరి వేదనలు ఇవీ..

కలెక్టర్ చెప్పినా కరుణించలే..



రాయికల్ మండలం చింతలూర్ సర్వే నంబరు 89లో నా పేరిట ఉన్న 2.37 ఎకరాలను భూరికార్డుల ప్రక్షాళన సందర్భంగా ఇతరుల పేరిట పట్టా చేశారు. పొరపాటును సరిదిద్ది, అసలు యజమాని పేరు చేర్చాలని కలెక్టర్ ఆదేశించారు. అయినా, సిబ్బంది పట్టించుకోవడం లేదు. వృద్ధాప్యంతో పాటు అంగవైకల్యంతో బాధపడుతున్న. ఆఫీసుల చుట్టూ తిరిగే శక్తి లేదు. నా భూమిని నా భార్య రాజు పేరిట మార్పిడి చేయండి.

– ముద్దం గంగారాం, చింతలూరు, రాయికల్

ఆత్మహత్యే శరణ్యం



ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధించే బీఈడీ కోర్సు పూర్తిచేసిన. 2019లో కాంట్రాక్టు ఐఈఆర్‌పీ టీచర్ పోస్టుకు అర్హత సాధించిన. కొంత కాలం కరీంనగర్‌లో చదివాననే సాకుతో స్థానికేతరురాలిగా పరిగణించిన అధికారులు.. ఇటీవల చేపట్టిన నియామయాల్లో నాకు అవకాశం ఇవ్వలేదు. నాకు ముగ్గురు పిల్లలు. వారు మానసిక వికలాంగులు. సమగ్ర శిక్షా అభియాన్‌లోని భవిత స్కూల్ ఉద్యోగం ఇప్పించండి. లేకుంటే ఆత్మహత్యే శరణ్యం.

– నక్క సునీత, అల్లిపూర్, రాయికల్

ప్రాధాన్యం ఇవ్వండి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేపట్టే కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీలో మాకు ప్రాధాన్యం ఇవ్వండి. రెండోవిడత కంటివెలుగు కార్యక్రమంలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసినం. ఆస్పత్రుల్లో భర్తీచేసే డాటా ఎంట్రీ ఆపరేటర్, రిసెప్షనిస్ట్, స్టోర్ కీపర్ ఉద్యోగ నియామకాల్లో మాకు అవకాశం ఇవ్వండి.

– కంటివెలుగు డాటా ఎంట్రీ ఆపరేటర్లు

మరోచోట నిర్మించండి



మా ఊరు సర్వే నంబర్ 479లో ఐదెకరాలను 2007లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించారు. అక్కడ ప్రాథమిక సహకార సంఘం గోదాము నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలుకు అన్నివిధాలా ఆ స్థలం అనువుగా ఉంది. అక్కడ కాకుండా మరోచోట గోదాము నిర్మించేలా చూడండి.

– జాబితాపూర్ గ్రామస్తులు

వంతెన నిర్మించండి



జగిత్యాలలోని గోవింద్‌పల్లిని ఆనుకుని ఉన్న వెంకటాద్రినగర్‌లో మురుగునీటి కాలువలు లేవు. మోతె మున్సిపల్ పరిధి కాలనీ సమస్యలపై సర్పంచ్‌తో పాటు కార్యదర్శి స్పందించడం లేదు. వర్షం పడితే వెంకటాద్రినగర్‌కు రాకపోకలు నిలిచిపోతున్నాయి. గోవిందుపల్లి – వెంకటాద్రినగర్ ప్రాంతాల మధ్య లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి.

– వెంకటాద్రినగర్ వాసులు

రైతులను ఆదుకోవాలి



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పరిహారం అందించాలి. వరదల ధాటికి కొట్టుకుపోయిన వంతెనలు, కల్వర్టులను యుద్ధప్రాతిపదికన నిర్మించాలి. పలు ప్రాంతాల్లో నిలిచిపోయిన రాకపోకలను పునరుద్ధరించాలి. – అడ్లూరి లక్ష్మణ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు

నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమిస్తాం

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



రాయికల్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన 3.06 ఎకరాలను కలెక్టర్ ప్రభుత్వ భూమిగా గుర్తించారని, ఈ విషయంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక ఆస్పత్రి పరిరక్షణ కమిటీ సభ్యులతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉత్తర్వుల ప్రతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సర్వే నంబరు 51, 52లో 3.06 ఎకరాలు ఉందని, కొందరు తప్పుడు డాక్యుమెంట్లతో ఆక్రమించేందుకు యత్నించారని ఆరోపించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా కోరుట్ల ఆర్డీవోతో విచారణ జరిపించారన్నారు. ఈ క్రమంలో డాక్యుమెంట్లు తప్పుడువిగా నిర్ధారించి, అది ప్రభుత్వ భూమిగా తేల్చి చెప్పారని అన్నారు. ఆ భూమిని రెవెన్యూ అధికారులు తమ అధీనంలోకి తీసుకోవాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీచేసినట్లు వివరించారు. కుల సంఘ నాయకులు, ఆస్పత్రి పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రి స్థలాన్ని కాపాడండి

జగిత్యాలటౌన్: రాయికల్‌లోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం స్థలాన్ని కబ్జాదారుల బారి నుంచి కాపాడాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలెక్టర్ యాస్మిన్ బాషాను కలిసిన వినతిపత్రం అందజేశారు. తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

గ్రామ పంచాయతీల్లో అమలు చేస్తున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. తమ సమస్యలను మండలిలో ప్రస్తావించి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో జీవన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

చెరువులు, కుంటల మరమ్మతుకు కృషి

జగిత్యాలరూరల్: చెరువులు, కుంటల మరమ్మతుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పొరండ్ల ఊర చెరువును ఆయన పరిశీలించారు. సర్పంచ్ పొగాళ్ల సంధ్యారాణి, ఉపసర్పంచ్ సునీత, మాజీ ఎంపీటీసీ స్వామిరెడ్డి, నాయకులు బాపురెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజిరెడ్డి, కోటేశ్ ఉన్నారు.

పంచాయతీ కార్మికుల ‘చలో కలెక్టరేట్’



నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

జగిత్యాలటౌన్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సోమవారం కార్మికుల ఆధ్వర్యంలో ‘చలో కలెక్టరేట్’ నిర్వహించారు. తొలుత పట్టణంలోని యావర్ రోడ్డు, కొత్త బస్టాండ్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట కార్మికులు, నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. అంతకుముందు పటేల్‌చౌక్‌లో మహిళా కార్మికులు బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో 22రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, స్వీపర్లు, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లలో అత్యధికులు దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల పేదలేనని తెలిపారు. పనికి తగిన వేతనం, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వారు విన్నవించారు.

‘చావు’తిప్పలు

- వరద ఉధృతికి ధ్వంసమైన శ్మశానం
- మరమ్మతులు అత్యవసరం



అస్తవ్యస్తంగా మారిన కోరుట్ల పట్టణ శివారులోని శ్మశానవాటిక

కోరుట్ల: మున్సిపల్ పరిధిలో ఎవరు చనిపోయినా అంత్యక్రియలు పూర్తిచేసేందుకు స్థలం లేక తిప్పలు పడాల్సిన దుస్థితి తలెత్తింది. మూడురోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో శ్మశానం ధ్వంసమైంది. ఏడాది క్రితం సుమారు రూ.2 కోట్లు వెచ్చించి దీనిని నిర్మించారు. వరదలకు దెబ్బతిన్న ఈ ప్రాంతానికి మరమ్మతులు చేయడంలో జాప్యం జరిగితే అంత్యక్రియలు పూర్తిచేసేందుకు అవస్థలు ఎదుర్కోక తప్పదు. అంతేకాదు.. శ్మశానంలో చిందరవందరగా పడిఉన్న వస్తువులు దొంగల పాలయ్యే అవకాశాలు ఉన్నాయి.

రూ.2కోట్ల వ్యయం

- సుమారు రూ.2 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోనే అత్యుత్తమ శ్మశానవాటికల్లో ఒకటిగా నిలిచే రీతిలో కోరుట్ల శ్మశానవాటిక నిర్మించారు.
- ఆధునిక హంగులు, అవసరమైన వనరులు, మూడు చితి వేదికలు, వెయిటింగ్ రూంలు, ఆరు గదులు, స్నాన వసతి, అంత్యక్రియల అనంతరం కర్మకాండ కార్యక్రమాలు నిర్వహించడానికి అవసరమైన వసతులు, ఆ హ్లాదకరమైన వాతావరణంలో శ్మశానవాటిక నిర్మించారు.
- తీరొక్క మొక్కలతో ఉద్యానవనం, చక్కని వాతావరణంలో శ్మశానవాటిక ఏర్పాటు చేశారు.
- ఇది అందుబాటులోకి రావడంతో ఏళ్ల తరబడి పట్టణవాసులు ఎదుర్కొన్న ఇబ్బందులు దూరమయ్యాయి.

వరదలకు ఛిన్నాభిన్నం..

బుధ, గురువారాల్లో కురిసిన భారీవర్షాలకు వాగు పక్కనే ఉన్న శ్మశానవాటికను వరద తాకింది. దానికి తాకిడికి తూర్పు, పడమరల్లో నిర్మించిన ప్రహరీ కూలిపోయింది. నేలపై పరిచిన టైల్స్ ధ్వంసమయ్యాయి. బోరు వరదలో కొట్టుకుపోయింది. గదుల్లో నిల్వచేసిన మూడు ఫ్రీజర్లు పాడయ్యాయి. ఫర్నీచర్ విరిగిపోయింది. మూడు చితి వేదికలు కుప్పకూలిపోయాయి. కరెంటు సరఫరా నిలిచిపోయింది. మొత్తమ్మీద శ్మశానవాటిక రూపురేఖలు మారిపోయాయి.

బాగు చేయకుంటే..

- అస్తవ్యస్తమైన శ్మశానవాటికను త్వరితగతిన బాగు చేయకుంటే జనం ఇబ్బందులు పడే దుస్థితి నెలకొంది.
- ప్రస్తుతం పట్టణవాసులకు సరైన శ్మశానవాటికలు అందుబాటులో లేవు.
- ఆదర్శనగర్‌లోని శ్మశానవాటికలో పూర్తిస్థాయిలో వసతులు కల్పించలేదు.
- కర్మకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణకు ఎలాంటి వసతులు కల్పించలేదు.
- అంతే కాకుండా ఊరికి దూరంగా ఉండటంతో అంత్యక్రియల కోసం సుమారు 3 కిలోమీటర్లు ప్రయాణం చేయడం కష్టతరంగా మారుతోంది.

రూ.30 లక్షలు కేటాయించాం



రాష్ట్రంలోనే అత్యంత ఆధునిక వసతులు ఉన్న కోరుట్ల శ్మశానవాటిక వరద తాకిడికి దెబ్బతినడం విచారకరం. వెంటనే మరమ్మతులు చేపట్టడానికి రూ.30 లక్షలు కేటాయించాం. పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేయిస్తాం. బంధువులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం.

– అన్నం లావణ్య, చైర్‌పర్సన్, కోరుట్ల

సహకార సంఘాల్లో ఔషధాలు

- కసరత్తు చేస్తున్న అధికారులు
- జిల్లాలో ఆరు సహకార సంఘాల ప్రతిపాదన
- గ్రామీణ ప్రజలకు తక్కువ ధరకే అందించాలని కేంద్రం నిర్ణయం

పెగడపల్లి: పేదల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద ప్రజలకు తక్కువ ధరలకు లభించే జనరిక్ మందులు అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా జనరిక్ మందుల దుకాణాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తక్కువ ధరకే జనరిక్ దుకాణాల్లో మందులు లభిస్తుడంటంతో ఆదరణ పెరుగుతోంది. దీంతో వీటిని ప్రోత్సహించేందకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 51 సహకార సంఘాలుండగా మొదటిదశలో ఆరు సహకార సంఘాల్లో ఈ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు సంబంధితశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామీణ, మండలాల్లో నిరుపేద కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. రోజువారీగా పనికి వెళ్తేగాని కుటుంబ పోషణ గడవని పరిస్థితి. ఇలాంటి కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యం బారినపడితే ఇబ్బందులు అన్నీ ఇన్నీకావు. ఒకవేళ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లినా మందులు ఎక్కువశాతం బయట దుకాణాల్లో కొనాల్సి రావడంతో పెద్దమొత్తంలో డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో నిరుపేదలకు తక్కువ ధరకు మందులు అందించాలనే ఉద్దేశంతో సహకార సంఘాల ద్వారా దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి విక్రయాలు, ఫార్మసీ



పెగడపల్లి సహకార సంఘం కార్యాలయం

లైసెన్స్ ఇతర విషయాలకు సంబంధించి మార్గదర్శకాలు రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. త్వరలో సమావేశం ఏర్పాటు చేసి విధి విధానాలు ఖరారు చేస్తామని సహకారశాఖ అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో 51 సహకార సంఘాలున్నాయి. వీటిలో పెగడపల్లి, కొడిమ్యాల, వెల్గటూర్, సారంగాపూర్, రాయికల్, ధర్మపురి సహకార సంఘాల్లో ఏర్పాటు చేసేందుకు సంబంధిత శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఎంతోమంది ఉన్నారు. వైద్యంకోసం ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. మందుల కొనుగోలుకు ఎక్కువ మొత్తంలో ఖర్చుచేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్కువ ధరకు లభించే జనరిక్ మందులను గ్రామీణ ప్రజల చెంతకు తీసుకువచ్చే ఏర్పాటు చేస్తుంది. జన్ ఔషధి' పేరుతో ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో దుకాణాలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

ప్రతిపాదనలు పంపాం



జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు కోసం జిల్లాలో ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ప్రతిపాదించాం. వీటి ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. మార్గదర్శకాలు రాగానే ప్రతిపాదించిన సంఘాల సిబ్బంది, శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటాం.

– రామానుజాచార్య, జిల్లా సహకారశాఖ అధికారి

ఈ కేంద్రాలు ఏర్పాటయితే పల్లె ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

ఫేస్‌బుక్ మిత్రుల చేయూత

ధర్మపురి : ఇరు కుటుంబాలకు ఫేస్‌బుక్ మిత్రులు రూ.1.26లక్షలు ఆర్థికసాయంగా అందించి ఔదార్యం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురికి చెందిన జక్కు ప్రవీణ్ 20 ఏళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందంగా భార్య శ్రీ దేవి ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ ఇద్దరు పిల్లలను చదివిస్తోంది. నాలుగు నెలల క్రితం శ్రీదేవి క్యాన్సర్‌బారిన పడటంతో వైద్య ఖర్చులు, కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతోంది. వెలగటూర్ మండలంలోని కిషన్‌రావుపేటకు చెందిన శ్రావణ్‌కుమార్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఓ అద్దె ఇంట్లో భార్య పిల్లలతో నివాసముంటున్నాడు. మూడునెలల క్రితం శ్రావణ్‌కుమార్ గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడి భార్య సింధూజకు కుటుంబ పోషణ భారమైంది. ఇరు కుటుంబాల సమస్యలు తెలుసుకున్న పట్టణానికి చెందిన


ఆర్థికసాయం అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ స్పందించి వీరికి ఆర్థికసాయం అందించాలని గతనెల 5న ఫేస్‌బుక్‌లో పోస్టుచేశాడు. స్పందించిన దాతలు సింధూజ బ్యాంకు ఖాతాకు రూ.1.26 లక్షలు విరాళాలు పంపించారు. వీటిని బ్యాంకు అధికారుల చేతుల శ్రీదేవికి రూ.70 వేలు, సింధూజకు రూ. 56 వేలు పంపిణీ చేయించారు.

అసలు వీఆర్‌ఏ నేనే..

- ఉద్యోగం నాకే ఇవ్వాలి
- ప్రజావాణిలో డిప్యూటీ తహసీల్దార్‌కు ఓ వ్యక్తి వినతి

ఇబ్రహీంపట్నం : అసలు వీఆర్‌ఏ నేనేనని.. తనకే ఉద్యోగం ఇవ్వాలంటూ వర్షకొండ గ్రామానికి చెందిన సల్వాల పెద్ద గంగారం ప్రజావాణిలో డిప్యూటీ తహసీల్దార్ పద్మకు వినతిపత్రం అందజేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. 2009 నుంచి వంతులవారీగా వీఆర్‌ఏగా పనిచేస్తున్నానన్నారు. అనారోగ్యంతో కొన్ని రోజులు సెలవు తీసుకున్నానని, నాకు బదులు సల్వాల నడిపి గంగారం విధులు నిర్వహిస్తున్నాడని, తన


వినతిపత్రం అందజేస్తున్న పెద్ద గంగారం

సంతకాన్ని ఫోర్జరీ చేసి మోసం చేసినట్లు తెలిపాడు. నవంబర్ 1, 1991న కారుణ్య నియామకపత్రాన్ని పొందారని, ఇటీవల వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించిన క్రమంలో ఫోర్జరీ సంతకం ద్వారా ఉద్యోగం పొందాడన్నారు. వీఆర్‌ఏ నేనేనని సల్వాల నడిపి గంగారంపై చర్యలు తీసుకొని తనకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, మిషన్ భగీరథ ఏఈ మల్లేశం, ఏపీఎంవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లిపాలే శ్రేష్ఠం


మాట్లాడుతున్న సీడీపీవో వీరలక్ష్మి

జగిత్యాల: తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్ఠమని ఐసీడీఎస్ పీడీ వీరలక్ష్మి అన్నారు. జగిత్యాల ఐసీడీఎస్ కార్యాలయంలో జగిత్యాల రూరల్, అర్బన్, రాయికల్, మేడిపల్లి అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిపాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్ రాణి, జానకి, స్వరూపరాణి పాల్గొన్నారు.

పింఛన్ డబ్బులతో పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందిస్తున్న రాజేందర్

కోరుట్ల : పట్టణంలోని వేంకటేశ్వర ఆలయం వద్ద నివసించే కొక్కొండ రాజేందర్ అనే వికలాంగుడు ప్రభుత్వం అందించే పింఛన్ డబ్బులతో నిరుపేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకా లు అందిస్తున్నాడు. ఏటా 25 నుంచి 30 మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్‌లు అందజేస్తూ పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నాడు. ఇంకా పుస్తకాలు కొనని నిరుపేద విద్యార్థులు ఎవరైనా ఉంటే తనకు ఫోన్‌చేసి సంప్రదించవచ్చని తెలుపుతున్నాడు.

శ్రీమద్భాగవత సప్తాహం ప్రారంభం


మాట్లాడుతున్న సంతోష్‌కుమార్ శాస్త్రీ

జగిత్యాల: శ్రీ రామన్నారాయణను పూజిస్తే రెట్టింపు ఫలితాలు పొందవచ్చని శృంగేరి శారద పీఠం ఆస్థాన పౌరాణికులు సంతోష్‌కుమార్ శాస్త్రీ అన్నారు. జగిత్యాలలో శ్రీ మద్భాగవత సప్తాహం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికమాసంలో భాగవతం స్మరించడంతో మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వేద పండితులు వేణుగోపాలచార్య కౌశిక, తిగుళ్ల విషుశర్మ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ గేట్ల మూసివేత

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు సాగు, తాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లను సోమవారం మూసివేశారు. ఎగువ నుంచి వరద ఉధృతి తగ్గడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,091.00 అడుగులు కాగా ప్రస్తుతం 1089.9 అడుగులు ఉంది. నీటి నిల్వసామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం 84.291 టీఎంసీలు ఉంది. ప్రస్తుతం 8,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అదేస్థాయిలో అవుట్‌ఫ్లో ఉంది. ఎస్కేప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి కోసం 8 వేల క్యూసెక్కులు, లక్ష్మి కెనాల్‌కు 100 క్యూసెక్కులు, సరస్వతీ కెనాల్‌కు 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమ ఫలాలు


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అడ్లూరి లక్ష్మణ్

వెల్గటూర్ : కాంగ్రెస్ పాలనలోనే సబ్బండ వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాయని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో కప్పారావుపేటకు చెందిన పలు పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోయి రైతులు నష్టపోగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు కొట్టుకుపోయినా మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పందించడం లేదని, ఆత్మీయ సమ్మేళనాల పేరుతో ఇతర పార్టీల నేతలను బీఆర్‌ఎస్‌లో చేర్చుకుంటున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరికలు ఉంటాయని తెలిపారు. కార్యాక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, సర్పంచ్ మేరుగు మురళి గౌడ్, ఉపసర్పంచ్ సందీప్‌రెడ్డి, జిల్లా యువత ప్రధాన కార్యదర్శి గంద్ర శ్రీకాంత్ రావు, మండల యువత అధ్యక్షుడు పూదరి రమేశ్, సోషల్ మీడియా కన్వీనర్ గుమ్ముల వెంకటేశ్, కప్పారావుపేట గ్రామ అధ్యక్షుడు పోచయ్య, నాయకులు తిరుపతి, శశి, సంతోష్, అజయ్ పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జరిమానా

జగిత్యాల జోన్: విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఇద్దరికి రూ.1,43,952 జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్.నారాయణ సోమవారం తీర్పునిచ్చారు. విజిలెన్స్ సీఐ కె.స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలం బట్టపల్లి గ్రామానికి చెందిన కొక్కుల సురేశ్, జగిత్యాల మండలం గుట్రాజ్‌పల్లికి చెందిన బొక్కెనపల్లి రమేశ్ విద్యుత్ చౌర్యానికి పాల్పడగా అధికారులకు ఫిర్యాదు చేయడంతో మొదటిసారిగా భావించి ఇద్దరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. మళ్లీ జూలై 24, 2019న విద్యుత్ చౌర్యానికి పాల్పడటంతో విజిలెన్స్ అధికారులు ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. కేసు విచారణ అనంతరం కొక్కుల సురేశ్‌కు రూ.93,390, బొక్కెనపల్లి రమేశ్‌కు రూ.50,562 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించకపోతే మూడునెలల జైలుశిక్ష ఉంటుందన్నారు. విజిలెన్స్ ఎస్సైలు నిరంజన్ రెడ్డి, నరేశ్, సిబ్బందిని అభినందించారు.

వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలి

జగిత్యాల: అర్హులైన వారికి వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. సోమవారం వైద్యశాఖతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఇంటెన్సీ ఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ఈనెల నుంచి మూడు విడతల్లో ప్రతి విడతలో ఆరురోజుల పాటు ఆగస్టు 7 నుంచి 12, సెప్టెంబర్ 11 నుంచి 16, అక్టోబర్ 9 నుంచి 14 వరకు చేపట్టనున్నట్లు తెలిపారు. ఐదేళ్ల వరకు పిల్లలకు టీకాలివ్వాలని, వందశాతం వ్యాధి నిరోధక టీకాలు అందించడమే లక్ష్యమన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీధర్, ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, సమియొద్దీన్, జైపాల్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దొంగను పట్టుకున్న గ్రామస్తులు

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో టెలిఫోన్ కేబుల్‌ను కట్ చేస్తున్న దొంగను గ్రామస్తులు సోమవారం పట్టుకున్నారు. గ్రామంలోని దక్కన్ గ్రామీణ బ్యాంకు ముందున్న టెలిఫోన్ కేబుల్‌ను ఓ వ్యక్తి కట్ చేస్తుండగా గ్రామస్తులు ప్రశ్నించారు. పొంతనలేని సమాధానం తెలపడంతో అతడిని పోలీసులకు అప్పగించారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత


భక్తుడికి నగదు అప్పగిస్తున్న సిబ్బంది

వేములవాడ: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన ఓ భక్తుడు డబ్బులు పోగొట్టుకోగా ఎస్పీఎఫ్ సిబ్బంది తిరిగి అప్పగించారు. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన యాద రాములు సోమవారం కుటుంబ సభ్యులతో వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి వచ్చారు. ధర్మగుండంలో స్నానాలు చేస్తున్న సమయంలో నగదు, ఆధార్‌కార్డు మర్చిపోయాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శైలజ గమనించి కవర్‌ను ఎస్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామికి అప్పగించింది. ఆలయ మైక్ ద్వారా రాములును రప్పించి రూ. 2500 నగదు, ఆధార్ కార్డును అప్పగించారు. ఇక్కడ కానిస్టేబల్ శ్రీధర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి


కొమురెల్లి మృతదేహం

వెల్గటూర్(గొల్లపల్లి) : ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన వెనుగుమట్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కేతవేని కొమురెల్లి సోమవారం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై గొల్లపల్లి మండల కేంద్రానికి వెళ్లాడు. తిరిగి వెనుగుమట్లకు తిరిగొస్తుండగా గ్రామశివారులోకి చేరుకోగానే వెలగటూర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న ఆర్టీసీ బ స్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో కొమురెల్లి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య చిలుకవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు.

వరద ప్రవాహం వల్లే ఘటన

ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వెనుగుమట్ల గ్రామ సదాజల వాగు లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తుంది. వెనుగుమట్ల నుంచి గొల్లపల్లికి రాకపోకలు తెగిపోవడంతో శెకల్ల మీదుగా గొల్లపల్లికి రాకపోకలు సాగిస్తున్నారు. వాగు ప్రవాహం లేకపోతే తరచూ వెళ్లే దారిలో వెళ్తే ఈ ప్రమాదం జరిగేది కాదని కాదని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

బీసీలకు అవకాశం కల్పించండి

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు ఆదేశించి బీసీ మహిళలకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్ యాస్మిన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని రోస్టర్ విధానంలో బీసీ మహిళకు రిజర్వ్ చేశారని గుర్తుచేశారు. గత ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన భోగ శ్రావణి చైర్‌పర్సన్ ఎన్నికయ్యారని, అయితే, రాజకీయ ఒత్తిళ్ల తట్టుకోలేక తన పదవికి రాజీనామా చేశారని తెలిపారు. ఆమె స్థానంలో ఉన్నత వర్గానికి చెందిన వైస్ చైర్మన్‌కు బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. ఆరునెలుగా ఇన్‌చార్జి తోనే నెట్టుకు వస్తున్నారని అన్నారు. ఎన్నికలు నిర్వహించకుండా ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తితో పరిపాలన కొనసాగించడం రాజ్యాంగం కల్పించిన


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హక్కును కాలరాయడమేనని దుయ్యబట్టారు. అది అనైతికమని విమర్శించారు. ఇన్‌చార్జి పాలనతో అవినీతి చోటుచేసుకుందని, పాలన గాడితప్పిందని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీటీం లక్ష్యం

జగిత్యాలరూరల్: మహిళల రక్షణ కోసం షీటీం నిరంతర కృషి చేస్తోందని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురలో మహిళల చట్టాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అన్యాయానికి గురైన విద్యార్థినులు, మహిళలు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. బాధితులు నేరుగా షీటీం నంబరు 87126 70783కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతపై దృష్టిసారించాలని అన్నారు. సైబర్ నేరాలపై టోల్‌ఫ్రీ



ర్యాలీ తీస్తున్న అంగన్‌వాడీలు

నంబరు 1930, లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. షీటీం ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై అలీబేగ్, కానిస్టేబుళ్లు సౌజన్య, మంజూ పాల్గొన్నారు.

మెట్‌పల్లి ఆర్డీవోను మార్చాలని వినతి

జగిత్యాల: మెట్‌పల్లి ఆర్డీవోగా ఇటీవల నియామమైన అధికారిని మార్చాలని మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేసినట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ సోమవారం తెలిపారు. సదరు అధికారి కోరుట్ల, కథలాపూర్, మెట్‌పల్లి మండలాల్లో సుమారు ఎనిమిదేళ్లు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారని, పలు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయన్నారు. మళ్లీ ఆర్డీవోగా ఇదే ప్రాంతంలో నియమించడంతో భూముల సంబంధిత విషయాల్లో పేదలకు అన్యాయం జరిగే అవకాశముందన్నారు. ఆర్డీవోగా మరో అ. దికారిని నియమించాలని వినతిపత్రంలో కోరారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

జాతీయ చేనేత ఐక్య వేదిక అధికార ప్రతినిధిగా అక్షిత

సప్తగిరికాలనీ(కరీంనగర్): జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధికార ప్రతినిధిగా కరీంనగర్‌కు చెందిన డాక్టర్ అక్షితను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కష్టపడే వారికి సరైన గుర్తింపు ఉంటుందని, సంఘం బలోపేతానికి పాటుపడుతున్న కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు అక్షిత సేవలను మరింతగా వినియోగించుకునేందుకు


అక్షిత

రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్, రాష్ట్ర ఇన్‌చార్జి కాటారాందాస్, అధ్యక్షుడు మాడ రాజా, గౌరవ అధ్యక్షులు తిరందాస్ వేణుగోపాల్, కోట దామోదర్, యువజన విభాగం అధ్యక్షుడు చిలివేరి రామకృష్ణ, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ఎలుబాక సుజాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నేటినుంచి తల్లిపాల వారోత్సవాలు

జగిత్యాల: జిల్లాలో ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దివాకర సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం తల్లి పాల వారోత్సవాల నిర్వహణపై సమీక్షించారు. ఎస్‌ఏజీ సభ్యులు, మెప్మా అధికారులు సమన్వయం చేసుకుని గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. సాధారణ ప్రసవాలు కాకుండా ముహూర్తాలు చూసుకుని సిజేరియన్ ఆపరేషన్లు చేసుకోవడంతో అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని, సాధారణ ప్రసవాలు చేసుకునేలా చూడాలన్నారు. జిల్లా సంక్షేమాధికారి నరేశ్, డీఎంహెచ్‌వో శ్రీధర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దివాకర

కుక్కలదాడిలో 13 గొర్రెలు మృతి

మల్లాపూర్ : కుక్కలదాడిలో 13 గొర్రెలు మృతిచెందగా, మరో 7 గొర్రెలను గాయపర్చాయి. గ్రామానికి చెందిన కసాడి భూమేశ్ యాదవ్‌కు చెందిన గొర్రెలను మేపేందుకు తీసుకెళ్తుండగా, వీధి కుక్కలు దాడి చేయడంతో 13 గొర్రెలు మృతిచెందగా మరో 7 గొర్రెలకు గాయపర్చాయి. దాదాపు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని భూమేశ్‌కు ప్రభుత్వ పరిహారం చెల్లించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

పెట్రోల్‌లో నీళ్లు

జగిత్యాలక్రైం: స్థానిక ధర్మపురి రోడ్డులోని ఓ పెట్రోల్‌బంక్‌లో సోమవారం ఉదయం వాహనదారులు పోసుకున్న పెట్రోల్‌లో నీరు వచ్చింది. దీంతో వారు ఆందోళన చేపట్టారు. హనుమాన్‌వాడకు చెందిన నరేశ్ క్తి తన వాహనంలో పెట్రోల్ పోయించుకున్నాడు. వాహనం మొరాయించడంతో అనుమానం ఓ బాటిల్‌లో మరికొంత పెట్రోల్ పోయించాడు. దీంతో పెట్రోల్ కల్తీ అయిందని గుర్తించాడు. వాహనదారులు ఆందోళనకు దిగారు. సిబ్బంది వారిపై దురుసుగా ప్రవర్తించి, వీడియో తీశారు. ఆగ్రహం వ్యక్తం చేసిన వాహనదారులు.. ఆందోళన ఉధృతం చేయడంతో సిబ్బంది దిగివచ్చారు. పెట్రోల్ పోయించుకున్న వారికి డబ్బులు వాపస్ ఇవ్వడంతో శాంతించారు.


పెట్రోల్‌లో వచ్చిన నీటిని చూపుతున్న వ్యక్తి


పెట్రోల్ బంక్ నిర్వాహకులతో వాహనదారుల వాగ్వాదం